సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం । 24 । ఏప్రిల్ । 2025



చాడలో బౌద్ధ చరిత్ర
మోటకొండూరు మండలం చాడలో పురావస్తు శాఖ తవ్వకాల్లో బౌద్ధం ఆనవాళ్లు వెలుగు చూస్తున్నాయి.
- 10లో



కల్యాణకట్ట పంచాయితీ
యాదగిరిగుట్ట ఆలయ కల్యాణకట్టలో నాయీబ్రాహ్మణుల మధ్య.. పాత, కొత్త పంచాయతీ ఏర్పడింది.
- 10లో

గరిష్టం/కనిష్టం
41° /24°

వాతావరణం
ఆకాశం నిర్మలంగా ఉంటుంది
ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఆర్‌పీల ఎంపికకు దరఖాస్తుల ఆహ్వానం

భువనగిరి : విద్యలో నాణ్యత ప్రమాణాలు పెంపొందించేందకు గాను ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇచ్చేందుకు రిసోర్స్ పర్సన్ల (ఆర్‌పీ) ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన ఉపాధ్యాయులు నమూనా ఫారంలో పూర్తిచేసి జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఈ నెల 24న సాయంత్రం 5 గంటలలోపు అందజేయాలన్నారు. వివరాల కోసం కో ఆర్డినేటర్ సెల్ నంబర్ 98487 07758ను సంప్రదించాలని కోరారు.

యాదగిరి నృసింహుడికి నిత్యారాధనలు



ఉత్సవమూర్తులకు హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దివ్యక్షేత్రంలో బుధవారం సంప్రదాయ పూజలు నేత్రపర్వంగా చేపట్టారు. వేకువ జామున ప్రధానాలయాన్ని తెరిచిన అర్చకులు.. సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూలకు అభిషేకం చేసి తులసీదళ, సహస్ర నామార్చనతో కొలిచారు. ఇక ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవారి జోడు సేవలను ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు. ఆయా వేడుకల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి స్వామివారికి శయనోత్సవం చేసి ఆలయ ద్వార బంధనం చేశారు.

నారాయణపురం@43.1



చున్నీ కప్పుకుని వెళ్తున్న అమ్మాయిలు

భువనగిరిటౌన్ : ఎండలు మండిపోతున్నాయి.ఉదయం 8 గంటలకే వాతావరణం వేడెక్కుతుండటంతో ఇళ్ల నుంచి బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా పగటి ఉష్ణోగ్రతలు గరిష్టస్థాయికి చేరడంతో జనం ఎండ వేడిమిని తాళలేకపోతున్నారు. గడిచిన నాలుగైదు రోజులుగా జిల్లాలో సగటు ఉష్ణోగ్రతలు 43 డిగ్రీలు నమోదవుతుండడమే దీనికి నిదర్శనం. బుధవారం అత్యధికంగా సంస్థాన్‌నారాయణపురంలో 43.1, రామన్నపేటలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆ తరువాత గుండాల 42.5, రాజాపేట 42.4, వలిగొండ 42.4, మోత్కూరు 42.2, చౌటుప్పల్ 42.2, ఆలేరు 42.0, అడ్డగూడూరు 42.0, ఆత్మకూర్(ఎం) లో 42 డిగ్రీలుగా నమోదైంది. ఎండనుంచి ఉపశమనం పొందడానికి గొడుగులు, టోపీలు ధరిస్తున్నారు. జిల్లాను వాతావరణ శాఖ ఆరెంజ్ జోన్‌గా ప్రకటించింది.

● అమర జవాన్లకు నివాళి



జమ్మూకశ్మీర్ పహల్‌గామ్ ఉగ్రదాడిని నిరసిస్తూ, అసువులు బాసిన జవాన్ల ఆత్మకు శాంతి చేకూరాలని బుధవారం రాత్రి చౌటుప్పల్‌లో జాతీయ రహదారిపై కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు -చౌటుప్పల్

ఇక ఆటాపాట

- ముగిసిన విద్యా సంవత్సరం
- నేటినుంచి పాఠశాలలకు వేసవి సెలవులు
- జూన్ 12న పునఃప్రారంభం



వలిగొండ జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేస్తున్న హెచ్ఎం

భువనగిరి : పాఠశాలలకు గురువారం నుంచి వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. జూన్ 11 వరకు సెలవులు ప్రకటించింది. జూన్ 12న పునఃప్రారంభంకానున్నాయి. చివరి రోజు బుధవారం పాఠశాలల్లో తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేశారు. వారి సమక్షంలోనే విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. వేసవిలో పిల్లల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉపాధ్యాయులు వారికి వివరించారు. సంక్షేమ హాస్టళ్లు, గురుకులాలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉన్న విద్యార్థులు ఇంటిబాట పట్టారు.



కుమార్తెను ఇంటికి తీసుకెళ్తున్న తల్లి

వరంగల్ సభకు లక్ష మంది

- బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవానికి ఉమ్మడి జిల్లా నుంచి భారీగా జనసమీకరణ
- నాలుగు నియోజకవర్గాల నుంచే సగం మంది
- మిగతా చోట్ల నుంచి పెద్ద సంఖ్యలో తరలిస్తాం
- కేసీఆర్ చెప్పేది వినేందుకు ప్రజలు, రైతులు స్వచ్ఛందంగా వస్తామంటుండ్రు
- కాంగ్రెస్‌కు ఓటేసినోళ్లే కసిగా సభకు రావడానికి సిద్ధమవుతుండ్రు
- ఎక్కడ చూసినా సభపైనే చర్చ
- సభ పేరు వింటేనే అధికార పక్షం జంకుతుంది

'సాక్షి' ఇంటర్వ్యూలో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'వరంగల్‌లో ఈనెల 27వ తేదీన జరిగే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ బహిరంగ సభకు ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి లక్షమందిని తరలించేందుకు సిద్ధమవుతున్నాం. అందులో భాగంగా వరంగల్‌కు సమీప నియోజకవర్గాలైన ఆలేరు, భువనగిరి, సూర్యాపేట, తుంగతుర్తి నుంచి 12,500 చొప్పున 50వేల మందిని తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి' అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభ జనసమీకరణ వివరాలను 'సాక్షి' ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

కాంగ్రెస్ నేతల్లో గగుర్పాటు



బీఆర్ఎస్ రజతోత్సవ సభ కాంగ్రెస్ నేతల్లో గగుర్పాటు కలిగిస్తోంది. ఇది బీఆర్ఎస్ సభనా, లేక టీఆర్ఎస్ సభనా అంటూ కాంగ్రెస్ నాయకులు ఆగమాగం అయితుండ్రు. సభకు కేసీఆర్ వస్తుండే. ఆల్‌రెడీ బీఆర్ఎస్ పేర ఎన్నికల్లో పోటీనే చేసినం. మీకెందుకు అనుమానం. ఉమ్మడి జిల్లా నుంచి బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజలతోపాటు రైతులు లక్ష మంది తరలిరానున్నారు.

ఎడ్లబండ్ల యాత్ర మొదలైంది

ఎడ్లబండ్లు, సైకిల్, పాద యాత్రలకు పార్టీ కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే సూర్యాపేట జిల్లా ఆత్మకూర్(ఎస్) మండలం నుంచి ఎడ్లబండ్ల ర్యాలీ ప్రారంభమైంది. నెమ్మికల్ దండు మైసమ్మ ఆలయం వద్ద పూజలు చేసి రైతులు ర్యాలీని ప్రారంభించారు. బండి వెనుక బండి కట్టి 16 బండ్లు కట్టి అనే పాటను గుర్తుగా 16 బండ్లతో వరంగల్ సభకు ర్యాలీగా వెళ్లారు. అర్వపల్లి నుంచి సైకిళ్ల మీద యాత్రగా వెళతామని యువత ముందుకు వస్తే రెండు రోజులు ఆగాలని చెప్పాను. పాదయాత్రకు కూడా సిద్ధమవుతున్నారు. ఎండల తీవ్రతతో ఆగాలని సూచించాం. జనాల్లో అలాంటి వాతావరణం వస్తే సభ విజయవంతమవుద్దనేది కచ్చితమైంది. మేము పేరుకే రజతోత్సవ సభ నిర్వహిస్తున్నాం. ప్రజల ఆలోచన వేరే ఉంది. వారే పెద్ద ఎత్తున బయల్దేరి సభకు రావాలని చూస్తున్నారు. వరంగల్ సభ పండుగ వాతావరణంలో జరగబోతుంది. ప్రభుత్వం మీద వ్యతిరేకతతో అప్పుడే సభకు ఏ విధంగా నైనా హాజరు కావాలని చూస్తున్నారు. కేసీఆర్ ఉంటే మంచి జరుగుతుందనే భావన జనాల్లో ఉంది.

చరిత్రలో నిలిచిపోనుంది

రజతోత్సవ సభ చరిత్రలో నిలిచిపోనుంది. ఇప్పటికే కాంగ్రెస్‌లో అలజడి మొదలైంది. సభపై పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు. సభ తర్వాత ప్రజల్లో కాంగ్రెస్‌పై మరింత వ్యతిరేకత పెరుగుతుందన్న భయాందోళన ప్రభుత్వంలో ఉంది. అందుకే సభపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ప్రజలు స్వచ్ఛందంగా సభకు హాజరయ్యేందుకు సిద్ధమవుతున్నారు.

ఏ నోట విన్నా సభపైనే చర్చ

ఏ పెళ్లిలో, ఏ చావుకెళ్లినా బీఆర్ఎస్ సభ గురించి చర్చ సాగుతోంది. ఎన్నికల ముందు మమ్ముల చూసి పక్కకు పోయినోళ్లు కూడా ఇయ్యాల మా దగ్గరకు వస్తుండ్రు. సభకు రావాలని చూస్తుండ్రు. కాంగ్రెస్‌కు ఓటేసిన నేతలే కసిగా వరంగల్ సభకు వచ్చేందుకు సిద్ధమవుతుండ్రు. జనాలకు కేసీఆర్ అంటే చాలా ప్రేమ ఉంది. కానీ కాంగ్రెస్ నేతలు చెప్పిన మాయమాటలతో ఇంకా ఏమైనా రుణమాఫీ, రూ.2,500 వస్తుందనే ఆశతో కాంగ్రెస్‌కు ఓటేసిండ్రు. ప్రధానంగా ఎన్నికల్లో కాంగ్రెసోళ్లు చెప్పిన మాయ మాటలకు నిరుద్యోగులు ఎట్రాక్టు అయినరు. ఇప్పటి యువతకు తెలంగాణ ఉద్యమం గురించి తెలియదు. ఎన్నికల్లో కేసీఆర్ ఇంటికో ఉద్యోగం ఇస్తానని హామీ ఇచ్చి ఇవ్వలేదంటూ కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేశారు. దాంతో నిరుద్యోగులు ఎట్రాక్టు అయ్యిండ్రు. తల్లిదండ్రులకు కూడా యువతే చెప్పుకుంది. రుణమాఫీ ఇస్తే సరిపోతుందా..ఉద్యోగాలు కూడా రావాలనడంతో వారు ఆలోచనలో పడి ఓటేశారు. అలాంటి నిరుద్యోగులు కూడా ఇప్పుడు కేసీఆర్ వెంటే నడిచేందుకు సిద్ధమవుతున్నారు.కాంగ్రెస్ మోసాలు సంవత్సరంలో తెలుసుకున్నరు. ఒక్క నోటిఫికేషన్ వేయలేదు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన వాటినే భర్తీ చేసిందని దాంతో నిరుద్యోగులు అసలు విషయం తెలుసుకున్నారు.వరంగల్ సభకు వాళ్లే ముందు నడవబోతున్నారు. కేసీఆర్‌కు ఓటేయక పొరపాటు జరిగిన విషయాన్ని గమనించి సభకు రావాలని చూస్తున్నారు.

పెళ్లింట పసిడి గుబులు

రూ.లక్షకు చేరిన తులం బంగారం ధర

- సామాన్య, మధ్య తరగతి వర్గాల్లో ఆందోళన
- కట్న, కానుకల కింద ఇచ్చే బంగారం తగ్గించుకునే ఆలోచన
- జిల్లా వ్యాప్తంగా తగ్గిన కొనుగోళ్లు
- వెలవెలబోతున్న జ్యువెలరీ, బంగారం షాపులు



సాక్షి, యాదాద్రి : 'పెళ్లికి మా అమ్మాయికి ఎన్ని తులాల బంగారం పెడతారు' ఏయే నగలు ఇస్తారు?.. 'మా అబ్బాయికి మీరెన్ని తులాలు పెడతారో చెప్పండి?' పెళ్లి ఖాయం చేసుకున్నాక పెట్టిపోతల విషయంలో జరిగే చర్చల్లో సర్వసాధారణంగా వినిపించే మాటలివి.. కానీ, ఇప్పుడు పెళ్లి బడ్జెట్‌లో బంగారం ప్రస్తావన తెస్తేనే దడ పుడుతోంది. తులం బంగారం లక్ష రూపాయలకు చేరడంతో అన్ని వర్గాల్లో కలవరం మొదలైంది. ముఖ్యంగా సామాన్య, మధ్య తరగతి ప్రజలు పసిడి పేరెత్తినే అమ్మో అంటున్నారు. పెళ్లిళ్ల సీజన్ కావడంతో పెరిగిన బంగారం ధర ఆయా వర్గాలపై ఆర్థికంగా తీవ్ర ప్రభావం చూపనుంది. వివాహాది శుభకార్యాలకు సిద్ధమవుతున్న కుటుంబాలు ఉన్నదాంట్లోనే సర్దుకుపోయే అవకాశం ఉంది.

ఆడపిల్ల కుటుంబాల ఆవేదన వర్ణనాతీతం

వచ్చే నెలనుంచి మంచి ముహూర్తాలు ఉండడంతో పెద్ద ఎత్తున పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే పెళ్లి సంబంధాలు కుదుర్చుకున్న కుటుంబాలు అన్నీ సిద్ధం చేసుకుంటున్నాయి. కట్నం కింద బంగారు ఆభరణాలు పెట్టడం ఆనవాయితీ. ఈ క్రమంలో బంగారు ధర తులం రూ.లక్షకు చేరడంతో సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో గుబులు మొదలైంది. త్వరలో మరింత పెరిగే అవకాశం ఉందన్న ప్రచారం వారికి కంటిమీద కునుకులేకుండా చేస్తుంది. ప్రధానంగా ఆడపిల్లల తల్లిదండ్రులు వేదన వర్ణనాతీతం. ధర తక్కువ ఉన్నప్పుడు కొనుగోలు చేయలేకపోయామని మదనపడుతున్నారు.

భారీగా తగ్గిన కొనుగోళ్లు

బంగారం కొనుగోళ్లు గణనీయంగా తగ్గాయి. జిల్లా వ్యాప్తంగా 300కు పైగా బంగారం, జ్యువెలరీ షాపులు ఉన్నాయి. ధర తక్కువగా ఉన్నప్పుడు ఒక్కో దుకాణంలో రోజుకు సగటున పది తులాల బంగారం విక్రయించేవారు. ఇప్పుడు అందులో సగం కూడా వ్యాపారం జరగడం లేదని యజమానులు చెబుతున్నారు.

పెరిగిన ధరతో వివాదాలు

పెరిగిన బంగారం ధర వివాదాలు సృష్టిస్తోంది. పెళ్లిళ్ల సీజన్ కావడంతో గడిచిన మూడు నెలల కాలంలో వివిధ వర్గాల నుంచి తయారీదారులు ఆర్డర్లు తీసుకున్నారు. బంగారం ధర అమాంతం పెరగడంతో ఆర్డర్ ప్రకారం ఆభరణాలు చేసి ఇవ్వలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో వ్యాపారులు, ఆభరణాలు తయారు చేసే కంసాలీలు, వినియోగదారుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. తప్పనిసరి పరిస్థితిలో ఒప్పుకున్న ప్రకారం ఆభరణాలు చేసే క్రమంలో భారీ నష్టం చవిచూస్తున్నారు.



కొనుగోలుదారులు లేక భువనగిరి పట్టణంలో వెలవెలబోతున్న జ్యువెలరీ షాప్

ఖాళీగా కూర్చుంటున్న



20 సంవత్సరాలుగా బంగారం అమ్మడం, ఆభరణాలు తయారు చేస్తూ జీవనం సాగిస్తున్నాం. బంగారం రేట్లు ఊహించని విధంగా కొనుగోళ్లు తగ్గాయి. దీంతో వ్యాపారం జరగకపోవడమే కాకుండా నగలు తయారు చేసే పని ఉండడం లేదు. ప్రస్తుతం ఖాళీగా కూర్చుంటున్న.

-దాసోజు సంపూర్ణాచారి,చౌటుప్పల్

గిరాకీ 80 శాతం తగ్గింది



బంగారం ధర రూ.లక్షకు చేరడంతో కొనుగోళ్లు 80 శాతం తగ్గాయి. ధర పెరగకముందు భోజనం చేసే తీరిక కూడా ఉండేది కాదు. ఇప్పుడు షాప్‌కు వచ్చి ధర తెలుసుకుని పోతున్నారే తప్ప.. ఎవ్వరూ కొనుగోలు చేయడం లేదు. ఆర్థికంగా ఉన్నవారు మాత్రమే అత్యవసరానికి కొనుగోలు చేస్తున్నారు. ఆర్డర్లపై తీసుకున్న బంగారు నగల తయారీ విషయమైన కష్టమర్లతో గొడవలు జరుగుతున్నాయి.

-అక్కెనపల్లి కల్పన, జ్యువెలరీ షాపు, మోత్కూరు

పుస్తెతోనే సరిపెడుతున్నారు



పెరిగిన బంగారం ధరతో ఆభరణాలు చేయించే వారి సంఖ్య చాలావరకు తగ్గింది. గతంలో నెక్లెస్, పుస్తెల తాడు, ఇతర అభరణాలు 20,30 తులాలతో చేయించేవారు. ఇప్పుడు అటువంటి పరిస్థితి లేదు. కేవలం పుస్తె, తాడు, కమ్మలతోనే సరిపెడుతున్నారు. ధర పెరగడం కంసాలీల ఉపాధిపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది.

-పూజాలోజు కృష్ణాచారి, కంసాలి, ఆలేరు

ఆభరణాలకు బదులు ఆస్తులిచ్చే ఆలోచన



పెద్ద ఎత్తున బంగారం కలిగి ఉండి, ఆర్థిక వెసులుబాటు లేని కుటుంబాలు అవసరాలకు కొంత అమ్ముకునే ఆలోచనలో ఉన్నాయి. ధర భారీగా పెరగడంతో చాలా మంది షాప్‌కు వచ్చి అడిగి పోతున్నారు. ధర పెరగడంతో కొనుగోళ్లు తగ్గాయి. పెళ్లిళ్లు ఉన్న కుటుంబాలు పుస్తె మాత్రమే కొంటున్నారు. కట్నం కింద ఆభరణాలకు బదులు ఆస్తులు ఇచ్చే ఆలోచనలో ఉన్నారు.

-రావుల శ్రీధర్, బంగారం షాపు యజమాని, భువనగిరి

'ఎల్ఆర్ఎస్'ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు, వేదికపై అదనపు కలెక్టర్, జెడ్పీ సీఈఓ తదితరులు

● కలెక్టర్ హనుమంతరావు

సాక్షి,యాదాద్రి : అనధికార లే అవుట్‌లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు రాష్ట్ర ప్రభుత్వం కల్పించిన 25 శాతం రాయితీ అవకాశాన్ని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలిసి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులతో సమావేశం అయ్యారు. ఎల్ఆర్ఎస్ ఆవశ్యకత, ఫీజు రాయితీ గురించి వివరించారు. వారి సందేహాలను నివృత్తి చేశారు. 25 శాతం రాయితీతో ఫీజు చెల్లించేందుకు ఈనెల 30వరకు గడువు ఉందని, మళ్లీ గడువు పొడిగించే అవకాశం లేకపోచ్చన్నారు. రెగ్యులరైజ్ చేసుకోని భూముల్లో రిజిస్ట్రేషన్లు, నిర్మాణాలకు అనుమతి ఇవ్వబోమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ శోభారాణి, భువనగిరి, చౌటుప్పల్ ఆర్డీఓలు కష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, డీపీఓ సునంద పాల్గొన్నారు.

ఎక్స్‌రే కోసం నిరీక్షణ

భువనగిరి: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి బుధవారం ఎక్స్‌రే కోసం గంటల పాటు నిరీక్షించారు. ఓపీలో వివరాలు నమోదు చేసుకుని వైద్యుడి వద్దకు వెళ్లగా ఎక్స్‌రే పరీక్షలకు సిఫారసు చేశారు. వారు ఎక్స్‌రే విభాగానికి వెళ్లగా టెక్నీషియర్ లేడు. ఉదయం 9గంటలకు రావాల్సిన టెక్నీషియన్ 11.30కి వచ్చాడు. దీంతో రోగులు గంటల తరబడి పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఎక్స్‌రే కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న రోగులు

ట్యాంకరొస్తేనే గొంతు తడిచేది!

చౌటుప్పల్‌లో తాగునీటికి కటకట

- డిమాండ్‌కు అనుగుణంగా అందని మిషన్ భగీరథ నీళ్లు
- ఎండలకు అడుగంటిన స్కీం బోర్లు
- మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా
- సరిపోక ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తున్న జనం



హనుమాన్‌నగర్ కాలనీలోని ఓ ఇంట్లో ఉన్న సంపులో నీటిని నింపుతున్న మున్సిపల్ ట్యాంకర్

చౌటుప్పల్ : పట్టణంలోని పలు ప్రాంతాలు నీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నాయి. డిమాండ్‌కు అనుగుణంగా మిషన్ భగీరథ నీళ్లు రాకపోవడం, మరోవైపు ఎండలకు మంచినీటి పథకాలు అడుగంటడంతో పరిస్థితి దయనీయంగా మారింది. మున్సిపల్ యంత్రాంగం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా పూర్తిస్థాయిలో సమస్య తీర్చలేకపోతోంది.

భగీరథ నీళ్లు సగం లోపే..

రోజురోజుకూ పట్టణ విస్తరణతో పాటు జనాభా పెరుగుతోంది. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో 20 వార్డులు, 31,202 మంది జనాభా ఉంది. రోజుకు 6.5 ఎంఎల్‌డీల (65లక్షల లీటర్లు) నీరు అవసరం. ప్రస్తుతం కేవలం 2.5 ఎంఎల్‌డీల(25లక్షల లీటర్లు) నీళ్లు మాత్రమే వస్తున్నాయి. పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరగకపోవడంతో ఉన్నంతలో పొదుపుగా వార్డులకు పంపిణీ చేస్తున్నారు. స్థానిక బోర్లనుంచి అరకొరగా వస్తున్న నీటితో కలిసి వంతుల వారీగా సరఫరా చేస్తున్నారు.

ఈ ప్రాంతాల్లో సమస్య తీవ్రం

ప్రధానంగా 09,16,17,18,20వ వార్డు పరిధిలోని బంగారిగడ్డ, హనుమాన్‌నగర్, రత్నానగర్, సుందరయ్యకాలనీ, అంజనసాయి మెడోస్, బస్టాండ్ ఏరియాతో పాటు మరికొన్ని కాలనీల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. గతంలో మేనెలలో ఎద్దడి ఏర్పడగా ..ఈసారి ఫిబ్రవరిలోనే మొదలైంది.

రోజుకు రూ.1200 వెచ్చిస్తున్నాం



గతంలో మే నెలలో తాగు నీటి ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ సంవత్సరం ఫిబ్రవరి నుంచే నీటి కష్టాలు వచ్చాయి. మా హోటల్‌కు మూడు నెలలుగా మున్సిపాలిటీ నల్లా నీరు నిలిచిపోయింది. మా సొంత బోరు కూడా ఎండిపోయింది. దీంతో రోజూ ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు చేస్తున్నాం. ఇందుకోసం రోజుకు రూ.1200 వరకు ఖర్చు చేస్తున్నాం. హోటళ్లకు కూడా ఎంతోకొంత మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి ఆదుకోవాలి.

-గోపాలకృష్ణ శెట్టి, ప్రసాద్ ఉడిపి హోటల్ నిర్వాహకుడు, చౌటుప్పల్

ఇంటికి మూడు డ్రమ్ములే సరఫరా

అధికారులు ప్రణాళిక ప్రకారం ముందుకెళ్తున్నా నీఠ సమస్య పూర్తిస్థాయిలో పరిష్కారం కావడం లేదు. ఈ క్రమంలో ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఒక్కో ఇంటికి మూడు డ్రమ్ముల చొప్పున అందజేస్తున్నారు. ఇవి కూడా క్రమం తప్పకుండా సరఫరా చేయకపోవడంతో జనం నీటి కోసం అల్లాడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తున్నారు. ఇందుకోసం ట్యాంకర్‌కు రూ.500 నుంచి రూ.600 వరకు వెచ్చిస్తున్నారు. హోటళ్లు, బేకరీలు, దుకాణాలకు మున్సిపాలిటీ నీటి సరఫరా మూడు నెలలుగా నిలిచిపోయింది. ఇందుకు ట్యాంకర్‌కు రూ.1000నుంచి రూ.1200 వరకు చెల్లిస్తున్నట్లు నిర్వాహకులు వాపోతున్నారు.



ట్యాంకర్‌తో నీటిని పోయించుకుంటున్న ఓ హోటల్ నిర్వాహకుడు

పీసీసీ పరిశీలకులొస్తున్నారు!

- జిల్లాకు ఇద్దరి నియామకం
- లకావత్ ధనవంతి, పులి అనిల్‌కుమార్‌కు బాధ్యతలు

సాక్షి,యాదాద్రి : నేతలు, ప్రజాప్రతినిధులు, శ్రేణులను సమన్వయం చేస్తూ క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా పీసీసీ చర్యలకు ఉపక్రమించింది. ఇందుకోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు పరిశీలకులను నియమించింది. ఇందులో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లాకు వరంగల్ జెడ్పీ మాజీ చైర్మన్ లకావత్ ధనవంతి, డాక్టర్ పులి అనిల్‌కుమార్ నియమించింది.

పరిశీలకుల బాధ్యతలు

జిల్లా పరిశీలకులుగా నియమితులైన ధనవంతి, పులి అనిల్‌కుమార్ త్వరలో బాధ్యతలు స్వీకరించనున్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఏఐసీసీ, పీసీసీ డెలిగేట్స్, డీసీసీ మాజీ అధ్యక్షులు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, సీనియర్ నేతలతో సమావేశం కానున్నారు. ఆ తరువాత జిల్లా, మండల, గ్రామ స్థాయిలో సమావేశాలు నిర్వహించి అధిష్టానానికి నివేదికలు అందజేస్తారు. వీటి ఆధారంగా స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు దక్కనున్నట్లు పార్టీ సీనియర్ నాయకుడు ఒకరు చెప్పారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు పోత్నక్ ప్రమోద్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిశీలకుడిగా భువనగిరి పట్టణానికి చెందిన పోత్నక్ ప్రమోద్‌కుమార్‌ను నియమించారు. ప్రస్తుతం పీసీసీ కార్యదర్శిగా ఉన్న ప్రమోద్‌కుమార్ గతంలోనే పార్టీలో వివిధ హోదాల్లో పని చేసిన అనుభవం ఉంది.

క్లుప్తంగా

రేపు మానవ హక్కుల కమిషన్ చైర్మన్ రాక

నల్లగొండ: రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ డాక్టర్ షమీమ్ అక్తర్ శుక్రవారం నల్లగొండకు రానున్నారు. ఉదయం 8గంటలకు హైదరాబాద్ నుంచి కుటుంబ సభ్యులతో కలిసి బయల్దేరి 10గంటలకు నల్లగొండలోని ఆర్అండ్బీ గెస్ట్ హౌస్కు చేరుకుంటారు. 11:30గంటలకు జిల్లా జైలుఖానాను సందర్శిస్తారు. మధ్యాహ్నం ఆర్అండ్బీ అతిథి గృహంలో భోజనం చేసి రాత్రి 7గంటలకు తిరిగి హైదరాబాద్కు వెళ్తారు.

బుద్ధ జయంతికి రావాలని మంత్రి జూపల్లికి ఆహ్వానం



మంత్రి జూపల్లి కృష్ణారావుకు ఆహ్వాన పత్రం అందజేస్తున్న వీరమల్లుయాదవ్

నాగారం: ఫణిగిరి బౌద్ధ క్షేత్రంలో మే 12న నిర్వహించనున్న బుద్ధ జయంతి వేడుకలకు రావాలని పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును హైదరాబాద్లో కలిసి ఆహ్వాన పత్రం అందించినట్లు బోధిసత్వ ఫౌండేషన్ అధ్యక్షుడు పులిగిల్ల వీరమల్లుయాదవ్ తెలిపారు. బుధవారం నాగారం మండల కేంద్రంలో వీరమల్లు యాదవ్ మాట్లాడుతూ... ఫణిగిరి బౌద్ధ క్షేత్రం విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పేలా బుద్ధ జయంతి రోజున ప్రపంచ సుందరీమణులతో హెరిటేజ్ వాచ్ కార్యక్రమం నిర్వహించాలని మంత్రిని కోరినట్లు తెలిపారు. సీఎం రేవంత్రెడ్డి జపాన్లోని హిరోషిమా ప్రభుత్వంతో బౌద్ధ వారసత్వ సంపదను కాపాడుకోవాలని నిర్ణయించడం సంతోషదాయకమన్నారు.

కుటుంబ తగాదాలతో దాడి

- ఇద్దరికి గాయాలు

నకిరేకల్: కుటుంబ తగదాల కారణంగా అత్త, ఆమె తమ్ముడిపై అల్లుడు దాడి చేసి గాయపర్చాడు. ఈ ఘటన నకిరేకల్ పట్టణంలోని తాటికల్ రోడ్డులో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్ పట్టణంలోని తాటికల్ రోడ్డులో నివాసముంటున్న బోయింద జానమ్మకు నలుగురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తెను సూర్యాపేటకు చెందిన పెరుమాళ్ల రవికి ఇచ్చి వివాహం చేసింది. భార్యాభర్తల మధ్య తగదాలు రావడంతో జానమ్మ నల్లగొండ మహిళా పోలీస్ స్టేషన్లో అల్లుడిపై మంగళవారం ఫిర్యాదు చేసింది. మంగళవారం రాత్రి 12గంటల సమయంలో అల్లుడు రవితో పాటు మరో వ్యక్తి చింతమల్ల రాహుల్ జానమ్మ ఇంటికి వచ్చి ఆమెతో పాటు ఆమె తమ్ముడు ఎడ్ల ప్రకాష్పై దాడి చేసి గాయపర్చారు. బుధవారం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చారి తెలిపారు.

సీహెచ్సీని సందర్శించిన వరల్డ్ బ్యాంక్ బృందం



ఆలేరు సీహెచ్సీలో వరల్డ్ బ్యాంక్ బృందం

ఆలేరురూరల్: ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్సీ)ని వరల్డ్ బ్యాంక్ బృందం సభ్యులు డాక్టర్ రమణ, డాక్టర్ కృష్ణ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రోగులుకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. డెలివరీ కేసుల గురించి వివరాలు అడిగారు. రోగులకు అందిస్తున్న సేవలు, మంచి ఆహారం అందిస్తున్నారా అని ఆరా తీశారు. డాక్టర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ సుమన్, కళ్యాణ్, డాక్టర్ యశోదా, డాక్టర్ శిల్ప, డీపీఓ నెహ్రాలా, సీహెచ్సీ సూపరింటెండెంట్ స్వప్న, రజిని, రామ కోటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

చాడలో బౌద్ధ చరిత్ర

- గతేడాదిగా పురావస్తు శాఖ తవ్వకాలు
- పెద్ద ఎత్తున బయటపడుతున్న బౌద్ధం ఆనవాళ్లు
- ఏడు రోజుల క్రితం తవ్వకాల పనులను పరిశీలించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం



చాడ గ్రామంలో తవ్వకాలు జరుపుతున్న పురావస్తు శాఖ అధికారుల బృందం

సాక్షి, యాదాద్రి: యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం చాడ గ్రామంలో పురావస్తు శాఖ ఆధ్వర్యంలో తవ్వకాలు కొనసాగుతున్నాయి. సూర్యాపేట జిల్లాలోని ఫణిగిరి తర్వాత అతిపెద్ద బౌద్ధ స్థూపం ఆనవాళ్లు ఇక్కడ వెలుగు చూస్తున్నాయి. ఇందులో బుద్ధ విగ్రహాలు, శిల్పాల శకలాలు, మట్టిపూసలు, బొక్కగాజులు, శాతవాహన కాలం నాటి డిజైన్ పెంకులు, పొడవైన పెద్ద ఇటుకలు, బౌద్ధ విహార గోడలు బయల్పడుతున్నాయి.



2010లో చాడ గ్రామంలో బయటపడిన బుద్ధుడి విగ్రహం

2003లోనే గుర్తింపు..

2003లోనే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం చాడ గ్రామంలో బౌద్ధం ఆనవాళ్లు గుర్తించింది. అంతే కాకుండా 2010లో గ్రామానికి చెందిన భూమయ్యగౌడ్ పొలం దున్నుతుండగా పురాతన విగ్రహం ఒకటి బయటపడింది. దీంతో పురాతన చరిత్రను బయటకు తీయడానికి పురావస్తు శాఖ పూనుకుంది. ఈ గ్రామంలో ఎన్నో బౌద్ధ మత ఆనవాళ్లు ఉన్నాయి. ఇక్కడి ప్రజలు వాటిని దేవతామూర్తులుగా పూజిస్తారు. 2024లో చాడ గ్రామంలో ఆర్కియాలజీ శాఖ తవ్వకాలకు శ్రీకారం చుట్టింది. భూమయ్యగౌడ్కు చెందిన రెండు ఎకరాల్లో ఈ తవ్వకాలు ప్రారంభమయ్యాయి. గత సంవత్సరం వేసవిలో చేసిన విధంగానే ఈసారి కూడా ఆర్కియాలజీ శాఖ అధికారులు, విద్యార్థులు తవ్వకాలను పరిశీలిస్తున్నారు. గ్రామానికి చెందిన కూలీలతో తవ్వకాలు ప్రారంభించారు. దొరికిన ప్రతి వస్తువును క్షుణ్ణంగా పరిశీలించి భద్రపరుస్తున్నారు.

గతేడాది బయటపడిన శాసనం

2024లో జరిపిన తవ్వకాల్లో బ్రహ్మీ లిపిలో ఉన్న శాసనం బయటపడింది. ఈ శాసనంలో చాడ పేరు సదరిక అని ఉంది. సదరిక క్రమంగా వాడుకలోంచి చాడగా మారిందని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. చాడ శాసనం గురించిన వివరాలు ఎపీగ్రఫీ డిపార్ట్మెంట్ డైరెక్టర్ కె. మునిరత్నంరెడ్డి గతంలోనే వెల్లడించారు.



బిక్కేరు వాగు బౌద్ధం నుంచే..

ఆలేరు వాగు కాస్తా చాడ వరకు వచ్చేసరికి బిక్కేరు వాగుగా మారుతుంది. అప్పట్లో బౌద్ధ భిక్షువులు ఉండే ప్రాంతం కావడంతో ఈ ప్రాంతానికి బిక్కేరు అని పేరు వచ్చింది. అలాగే ఇక్కడ లభించిన నిలబడి ఉన్న బౌద్ధ విగ్రహం నల్లగొండలోని పానగల్ మ్యూజియంలో ఉంది. 2024 నుంచి జరుపుతున్న తవ్వకాల్లో మరికొన్ని విగ్రహాలు దొరికినా వాటి వివరాలు ఆర్కియాలజీ శాఖ అధికారులు బయటకు చెప్పడం లేదు. ఇక్కడ లభిస్తున్న వస్తువులు, మట్టిపొరలు, గాజులు, పూసలు, విగ్రహాలు, నాణేలు తదితర బౌద్ధం ఆనవాళ్లను ఆర్కియాలజికల్ విద్యార్థులు గ్రేడింగ్ ఇస్తున్నారు. గతంలో ఇక్కడ ఉన్న బౌద్ధ స్థూపానికి సంబంధించిన ఇటుకల కుప్పలు ఇప్పుడు లేవు. ప్రస్తుతం అవి చెదిరిపోయాయి. తవ్వకాల్లో ఇంకా బౌద్ధ శిల్పాలు బయటపడే అవకాశం ఉంది. ఎకరం రెండు ఎకరాల్లో కాకుండా ఎక్కువ విస్తీర్ణంలో తవ్వకాలు జరిగితే మరింత చరిత్ర బయటపడుతుందని అధికారులు భావిస్తున్నారు. ఫణిగిరిలో జరిపిన

చాడను సందర్శించిన కొత్త తెలంగాణ చరిత్ర బృందం

ఏడు రోజుల క్రితం చాడ గ్రామాన్ని కొత్త తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ కో–కన్వీనర్ భద్రగిరీష్, సభ్యులు ఎం. రవి, కుండె గణేష్, ఎండీ ఇమ్రాన్ సందర్శించారు. తవ్వకాల్లో బయటపడుతున్న పురాతన సంపదను పరిశీలించారు. తవ్వకాలు నిర్వహిస్తున్న వారిలో తెలంగాణ వారసత్వశాఖ అధికారులు పి. నాగరాజు, సాగర్, పూణా దక్కన్ కాలేజీ ప్రొఫెసర్ ఘన్వీర్ శ్రీకాంత్, ఇతర సిబ్బంది ఉన్నారు. తవ్వకాల్లో దాదాపు 80మంది పాల్గొంటున్నారు.



చాడ గ్రామంలోని పొలాల్లో లభించిన బౌద్ధ విగ్రహాల ఆనవాళ్లు

తవ్వకాల్లో బయటపడ్డ బౌద్ధం ఆనవాళ్లను అక్కడే భద్రపరిచారు. అయితే చాడలో లభిస్తున్న వాటిని ఇక్కడే భద్రపర్చాలని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇక్కడి చరిత్ర మరో ప్రాంతానికి తరలిపోకుండా ఇక్కడే మ్యూజియం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తవ్వకాలు పూర్తయిన తర్వాత విడుదల చేసే సంపూర్ణ నివేదిక వచ్చినప్పుడు ఇక్కడి ప్రాముఖ్యత, విశిష్టత వెలుగు చూస్తుందని పురావస్తుశాఖ అధికారులు అంటున్నారు.

గాంధార శిల్ప సంపద

ఇక్కడ దొరికిన బౌద్ధ శిల్పాలలో గాంధార శైలికి చెందిన బుద్ధుడి స్థానక భంగిమ శిల్పాలు, అర్ధ శిల్పాలు, బుద్ధ విగ్రహాల తలలు, విగ్రహాల శకలాలు, క్రీ.పూ. 1వ శతాబ్దం నుంచి 3వ శతాబ్దపు నాణేలు, టెర్రకోట బొమ్మలు, దంతపు గాజుల ముక్కలు, శాతవాహన కాలం నాటి కుండ పెంకులు, శాతవాహనకాలం నాటి ఇటికెలు, పూసలు అనేకం వెలుగుచూస్తున్నాయి.



తవ్వకాలను పరిశీలిస్తున్న కొత్త తెలంగాణ చరిత్ర బృందం పరిశోధకులు

ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి



వైష్ణవిని అభినందిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి

నూతనకల్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే కష్టపడి చదివి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్రెడ్డి అన్నారు. బుధవారం నూతనకల్ మండల కేంద్రంలో భూభారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సుకు హాజరైన మంత్రి.. మద్దిరాల మండలం చందుపట్ల గ్రామానికి చెందిన పచ్చిపాల వెంకన్న–సుమలత దంపతుల రెండో కుమార్తె వైష్ణవి ఇంటర్మీడియట్ ఫస్టియర్లో ఎంపీసీ విభాగంలో 467మార్కులు సాధించడంతో ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా వైష్ణవిని భువనగిరి ఎంపీ చామల కిరణ్కుమార్రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ శాలువా కప్పి అభినందించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధ, మండల పార్టీ అధ్యక్షుడు నాగం సుధాకర్రెడ్డి, జెన్నారెడ్డి వివేక్రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

- తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్కుమార్



ఆక్సిజనేటర్ను పరిశీలిస్తున్న తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్కుమార్

మర్రిగూడ: ప్రభుత్వ ఆస్పతుల్లో ప్రసవాల సంఖ్యను పెంచేందుకు వైద్యులు కృషిచేయాలని తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ కె. అజయ్కుమార్ అన్నారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలోని కమ్యూటనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్సీ)ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రూ.3లక్షల విలువైన రెండు ఆక్సిజనేటర్ మిషన్లను ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. త్వరలోనే ఆస్పత్రిలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని నియమిస్తామని పేర్కొన్నారు. డ్యూటీలో ఉన్న వైద్యులను ఇబ్బందులకు గురిచేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు డయాలసిస్ సెంటర్ను, రోగులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూను పరిశీలించారు. ఓపీ థియేటర్ను ఉపయోగంలోకి తేవాలన్నారు. ఆస్పత్రికి సంబంధించిన ఇంక్యూబేషన్ అన్నిరకాల పరికరాలు కూడా అందుబాటులోకి తేవాలని వైద్యులకు సూచించారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ మాత్రు నాయక్, సూపరింటెండెంట్ శంకర్నాయక్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్పీఎఫ్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేత



ఎస్పీఎఫ్ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసిన ఈఓ భాస్కర్రావు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట ఆలయంలో విధులు నిర్వహిస్తున్న స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(ఎస్పీఎఫ్) అధికారులు, సిబ్బందికి బుధవారం ఈఓ భాస్కర్రావు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ.. ఎస్పీఎఫ్ అధికారులు, సిబ్బంది ఆలయంలో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి ప్రశంసా పత్రాలు అందించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్పీఎఫ్ ఇన్స్పెక్టర్ శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

వీడని తల్లి, కుమార్తె మరణం మిస్టరీ..?

- నాలుగు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టిన పోలీసులు
- 11 రోజులవుతున్నా కొలిక్కి రాని కేసు





మృతి చెందిన రాజేశ్వరి, వేద సాయిశ్రీ (ఫైల్)

మిర్యాలగూడ అర్బన్: మిర్యాలగూడ పట్టణంలోని హౌజింగ్బోర్డు కాలనీకి చెందిన తల్లి, కుమార్తె మరణ మిస్టరీ 11 రోజులవుతున్నా ఇంకా వీడలేదు. ఈ నెల 12వ తేదీన వారిద్దరు ఇంట్లో మృతిచెందగా.. ఈ కేసు ఇంకా ఓ కొలిక్కి రాలేదు. ఏపీలోని పల్నాడు జిల్లా మాచర్ల మండలం గన్నవరం గ్రామానికి చెందిన గుర్రం సీతారాంరెడ్డి, రాజేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు వేదశ్రీ, వేద సాయిశ్రీ ఉన్నారు. ఓ ప్రైవేట్ ఆగ్రో కెమికల్ సంస్థలో పనిచేస్తున్న సీతారాంరెడ్డి నల్లగొండ జిల్లా సేల్స్ మేనేజర్గా బదిలీపై 15 ఏళ్ల క్రితమే ఇక్కడికి వచ్చి మిర్యాలగూడలో నివాసముంటున్నారు. ఈ నెల 10వ తేదీన సీతారాంరెడ్డి కంపెనీ బడ్జెట్ ఆడిట్ సమావేశం ఉండటంతో హైదరాబాద్కు వెళ్లి.. రెండు రోజుల తర్వాత ఇంటికి వచ్చి చూసేసరికి చిన్న కుమార్తె వేద సాయిశ్రీ గొంతుపై కత్తిగాటుతో, భార్య రాజేశ్వరి బెడ్రూంలో ఉరేసుకుని విగతజీవులుగా కనిపించారు.

నాలుగు బృందాలతో దర్యాప్తు..

ఈ కేసును ఛేదించడానికి పోలీసులు నాలుగు బృందాలు ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. ఒక బృందం ఏపీలోని జమ్మలమడుగు, రొంపిచెర్ల, కుంబంపాడు, దాచేపల్లి, నకిరేకల్ ప్రాంతాలలో పర్యటించి కేసుకు సంబంధించిన వివరాలు సేకరించినా.. మరో బృందం స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీలు, సెల్ఫోన్స్ సిగ్నల్స్ వంటి అంశాలపై కూపీ లాగినా.. మరో బృందం మృతుల ఇంటిని క్షుణ్ణంగా పరిశీలించి ఆధారాలు సేకరించినప్పటికీ, ఘటన జరిగిన సమయంలో ఇంట్లోనే ఉన్న సీతారాంరెడ్డి పెద్ద కుమార్తె వేదశ్రీ తాను నిద్రలో ఉన్నానని, తనకు ఏమీ తెలియదని చెప్పడంతో కేసు మిస్టరీ వీడడం లేదు. పోస్టుమార్టం ప్రాథమిక నివేదికలోనూ ఎలాంటి క్లూ దొరకలేదా..? ఒకవేళ దొరికినా.. ఆ విషయాలను ఇన్ని రోజులు పోలీసులు ఎందుకు గోప్యంగా ఉంచుతున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దర్యాప్తులో సేకరించిన విషయాలను పోల్చి చూసుకునేందుకు ఫోరెన్సిక్ నివేదిక కోసం పోలీసులు నిరీక్షిస్తున్నట్లు తెలుస్తోంది.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

యాదగిరిగుట్ట రూరల్: ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి కారు ఢీకొనడంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. ఈ ఘటన హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై యాదగిరిగుట్ట మండలం బాహుపేట గ్రామ స్టేజీ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆలేరు మున్సిపాలిటీ పరిధిలోని చింతలబస్తీకి చెందిన మొరిగాడి పరశురాములు(50), మొరిగాడి సంతయ్య(60) బుధవారం ద్విచక్ర వాహనంపై భువనగిరి మండలం రాయగిరిలో శుభకార్యానికి హాజరై తిరిగి ఆలేరుకు వెళ్తుండగా.. యాదగిరిగుట్ట మండలం బాహుపేట గ్రామ స్టేజీ పరిధిలోనికి రాగానే హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారిపై వెనుక నుంచి వచ్చిన కారు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పరశురాములు, సంతయ్య ఇద్దరూ ఎగిరి రోడ్డుపై పడడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను ఆలేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యాదగిరిగుట్ట ఎస్ఐ ఉదయ్కిరణ్ తెలిపారు. మృతులిద్దరు వరుసకు అన్నాదమ్ముళ్లు అవుతారని స్థానికులు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి..

తిప్పర్తి: బైక్ అదుపుతప్పి డివైడర్ను ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నార్కట్పల్లి–అద్దంకి రహదారిపై తిప్పర్తి మండల పరిధిలోని చిన్నాయిగూడెం గ్రామ సమీపంలో మంగళవారం రాత్రి జరిగింది. ఎస్ఐ సాయిప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ మండలం నర్సింగ్భట్ల గ్రామానికి చెందిన కంభం రవికుమార్(26), బడుపుల సాయిరాం డెకరేషన్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. మంగళవారం రాత్రి తిప్పర్తి సమీపంలోని దాబా వద్దకు తినడానికి ద్విచక్ర వాహనంపై వచ్చారు. దాబా మూసివేయడంతో తిరిగి నల్లగొండకు వెళ్తుండగా.. తిప్పర్తి మండల పరిధిలోని చిన్నాయిగూడెం వద్దకు రాగానే బైక్ అదుపుతప్పడంతో నార్కట్పల్లి–అద్దంకి రహదారి డివైడర్కు ఢీకొట్టారు. దీంతో కంభం రవికుమార్ రహదారిపై అవతలి వైపు పడగా.. అతడిని నల్లగొండ నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సాయిరాంకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉగ్ర దాడి హేయమైన చర్య

- శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్రెడ్డి

నల్లగొండ టూటౌన్: కశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య అని, ఉగ్రవాదాన్ని ఉక్కుపాదంతో అణచివేయాలని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కశ్మీర్లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాలని, హింసను ఏవిధంగా సహించరాదని అన్నారు. పర్యాటకులను పొట్టనబెట్టుకున్న ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

తాటిచెట్టు మీద పడి కూలీ మృతి

గరిడేపల్లి: మండల పరిధిలోని కల్మలచెరువు శివారులో బుధవారం తాటిచెట్టు మీద పడి కూలీ మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కల్మలచెరువు గ్రామానికి చెందిన ఒక రైతు పొలంలో తాటి చెట్టును తొలగించేందుకు శీతలతండా గ్రామానికి చెందిన గుగులోతు శ్రీను(52) కూలీ మాట్లాడుకొని తాటి చెట్టును తొలగిస్తుండగా.. ప్రమాదవశాత్తు తాటిచెట్టు శ్రీను మీద పడి అక్కడికక్కడే మృతిచెందాడు.

తమ్ముడి మృతి తట్టుకోలేక అన్న ఆత్మహత్య



కిరణ్ (ఫైల్)

భువనగిరిటౌన్, భూదాన్పోచంపల్లి: తమ్ముడు మృతి తట్టుకోలేక మానసికంగా కుంగిపోయిన అన్న ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన భువనగిరి మండలం తుక్కాపూర్లోని ఓ వెంచర్లో మంగళవారం రాత్రి జరిగింది. వివరాలు.. భూదాన్పోచంపల్లి మండలం పెద్దరావులపల్లికి చెందిన పర్వతం ఆంజనేయులు, అండాలు దంపతులకు ఇద్దరు కుమారులు కిరణ్కుమార్(25), సాయితో పాటు ఒక కుమార్తె ఉన్నారు. వీరి కుటుంబం పదేళ్ల క్రితం ఆలేరుకు వలస వెళ్లి అక్కడ పాత ఇనుప సామాను వ్యాపారం చేసుకొని జీవనం సాగిస్తున్నారు. అయితే చిన్న కుమారుడు సాయి మూడు నెలల క్రితం ఉరేసుకుని బలవర్మరణానికి పాల్పడ్డాడు. దీంతో ఆ కుటుంబం అక్కడ నుంచి భువనగిరి మండలం నాగిరెడ్డిపల్లికి వచ్చి ఉంటున్నారు. తమ్ముడి మృతి తట్టుకోలేక మానసికంగా కుంగిపోయిన కిరణ్కుమార్ తనకు బతకడం ఇష్టంలేదని తాను చనిపోతానంటూ తరచూ తల్లికి చెప్పేవాడు. కాగా మంగళవారం రాత్రి కిరణ్కుమార్ తనకు పని ఉందని ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తన సోదరికి ఫోన్ చేసి ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ చెప్పి ఫోన్ పెట్టేశాడు. అనంతరం భువనగిరి మండలం తుక్కాపూర్లోని ఓ వెంచర్లో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. బుధవారం సాయంత్రం కిరణ్కుమార్ మృతదేహాన్ని పెద్దరావులపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు.

‘కల్యాణ కట్ట’ పంచాయితీ

- యాదగిరిగుట్ట క్షేత్రం కల్యాణ కట్టలో కొత్తగా 20 మంది నాయీ బ్రాహ్మణుల నియామకం
- ఇప్పటికే పనిచేస్తున్న వారి నుంచి అభ్యంతరం
- ఉపాధి దెబ్బతింటుందని ఆవేదన



అధికారులతో వాగ్వాదం చేస్తున్న కల్యాణ కట్టలో విధులు నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులు

యాదగిరిగుట్ట: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ కల్యాణ కట్టలో నాయీ బ్రాహ్మణుల మధ్య పాత.. కొత్త పంచాయితీ నెలకొంది. ప్రస్తుతం దేవస్థానం కల్యాణ కట్టలో 96మంది నాయీ బ్రాహ్మణులు కమీషన్ పద్ధతిలో పనిచేస్తున్నారు. ఈ క్రమంలో మరో 20మందిని కల్యాణ కట్టలో విధులు నిర్వహించే విధంగా దేవాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వులతో ఈఓ భాస్కర్రావు నియమించారు. ఆ 20మంది నాయీ బ్రాహ్మణులు బుధవారం విధుల్లో హాజరయ్యేందుకు కల్యాణ కట్టకు చేరుకున్నారు. దీంతో అప్పటికే కొనసాగుతున్న 96మంది వారిని అడ్డుకొని ఆందోళన చేపట్టారు. అక్కడే విధులు నిర్వహిస్తున్న ఆలయ ఏఈఓతో వాగ్వాదానికి దిగారు. కోర్టు ఆర్డర్ ఉండటంతో నూతనంగా 20 మందిని కల్యాణ కట్టలో విధులు నిర్వహించేందుకు అనుమతించామని ఏఈఓ వివరించారు. అయినా ఆందోళన విరమించకపోవడంతో పోలీసులు అక్కడి చేరుకొని సముదాయించారు. అనంతరం కోర్టు ఆర్డర్, దేవాదాయ శాఖ ఇచ్చిన ఉత్తర్వుల కాపీని చూపెట్టిన తర్వాత 20 మంది ఉద్యోగంలో చేరారు.

ఉత్తర్వుల కాపీలో ఇలా..

దేవాలయ అభివృద్ధిలో భాగంగా కొండ కింద రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు, ఇళ్లు కోల్పోయిన 33 మంది నాయీ బ్రాహ్మణులకు కల్యాణ కట్టలో పని కల్పించేందుకు కమిషన్ పద్ధతిలో తీసుకోవాలని దేవాదాయశాఖ కమిషనర్ ఉత్తర్వుల్లో సూచించారు. ఈ మేరకు 20 మందిని అదనంగా నియమించినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

ఎలాంటి సమాచారం ఇవ్వలేదు

యాదగిరిగుట్ట ఆలయంలో 20 మంది నాయీ బ్రాహ్మణులను కొత్తగా నియమించడానికి కోర్టు ఆర్డర్ ఉందని ఈఓ చెబితే అది చూపెట్టాలని అడిగాం. కల్యాణ కట్టకు కొత్తగా ఎవరినైనా కేటాయిస్తే దేవస్థానం ఆధ్వర్యంలో మా సంఘానికి లెటర్ ఇస్తారు. కానీ ఎలాంటి కాపీ ఇవ్వలేదు. ఈఓతో పాటు కొంతమంది అధికారులు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఆర్డర్ తయారు చేసి 20 మందిని నియమించారు.

– రాచకొండ జానకిరాము, రాష్ట్ర దేవాలయ కల్యాణ కట్ట అధ్యక్షుడు

మా కల నెరవేరింది

కల్యాణ కట్టలో విధుల్లో చేరడంతో మా కల నెరవేరింది. కల్యాణ కట్టలో ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న నాయీ బ్రాహ్మణులు మా నియామకాన్ని వ్యతిరేకిస్తూ కోర్టులో కేసు వేశారు. తిరిగి మేము కూడా హైకోర్టుకు వెళ్లాం. హైకోర్టు మాకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఆర్డర్ కాపీని తీసుకొచ్చి ఈఓకు ఇచ్చాం. దీంతో విధుల్లో చేర్చుకునేందుకు ఈఓ ఆదేశించారు. తోటి నాయీ బ్రాహ్మణులతో కలిసి పనిచేస్తాం.

– జంపాల రాజు, యాదగిరిగుట్ట నాయీ బ్రాహ్మణుల సంఘం అధ్యక్షుడు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



గాయపడిన దాసరి యోగేంద్ర

చిట్యాల: విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల పట్టణంలోని పాలకేంద్రం సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. రామన్నపేట మండలం ఉత్తటూరు గ్రామానికి చెందిన దాసరి యోగేంద్ర విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారిపై చిట్యాల పట్టణ కేంద్రంలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ వద్ద ప్రమాదాలు జరగకుండా వాహదారులకు సూచనలు చేసేందుకు గాను కాంట్రాక్టర్ వద్ద పనిచేస్తున్నాడు. బుధవారం పాలకేంద్రం సమీపంలో విధులు నిర్వహిస్తున్న యోగేంద్రను టాటా ఏస్ వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం అంబులెన్స్లో నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.